# భారత రాజ్యాంగము-కనీస అవగాహన

**భారత రాజ్యాంగం ఏర్పడడానికి ముందు ......**

- 1600 సంవత్సరములో ఆంగ్లేయులు, ఈస్టిండియా కంపెనీ పేరుతో, వ్యాపారం కోసం, భారత్ రాక.
- 1857 సంవత్సరములో, మొదటి స్వాతంత్ర్య సంగ్రామం, ఈస్టిండియా కంపెనీ రద్దు, బ్రిటీష్ రాణి పాలన స్వీకారం.
- జాతీయోద్యమ కాలంలో1885-1905 వరకు ఉదారవాద లేక మితవాద దశ. 1905-1920 అతివాద దశ. 1920-1947 గాంధేయవాద దశ అంటారు.
- 1946 డిసెంబర్ 9న, భారత రాజ్యాంగం ఏర్పాటు చేయడం కోసం, రాజ్యాంగ సభ మొదట సమావేశం.
- 1947 ఆగష్ట్ 15న, భారత్‌కు స్వాతంత్ర్యం.
- 1947 ఆగష్ట్ 29న, రాజ్యాంగ ముసాయిదా కమిటీ డా.బి.ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 7గురితో ఏర్పాటు.
- 1948 ఫిబ్రవరి 21న, ముసాయిదా కమిటి, ముసాయిదా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సభ ముందు ఉంచింది.
- ప్రజల నుండి వచ్చిన 7635 సవరణలపై 114 రోజులు చర్చచేసి 2473 ఆమోదించారు.
- 1949 నవంబర్ 26న, భారత రాజ్యాంగం ఆమోదించడం జరిగింది. దీనినే రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటాము.
- 1950 జనవరి 26 నుండి భారత రాజ్యాంగం పూర్తి స్దాయిలో అమలు. మొదటి రాష్ట్రపతిగా డా. రాజేంద్ర ప్రసాద్ ప్రమాణ స్వీకారం. దీనినే గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాము.

**రాజ్యాంగ రూప కల్పనలో .........**

- 64 లక్షల రూపాయిలు ఖర్చుఐనది. 1,45,000 పదాలున్నాయి.
- 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేశారు.
- 299 మంది పాలు పంచుకున్నారు.
- రాజ్యాంగం తయారు చేయడానికి 2 సంవత్సరాల,11నెలల,18రోజులు పట్టింది.

**రాజ్యాంగం ఏర్పడిన తరువాత.........**

- అప్పటి(1950) భారత జనాభా సుమారు 31 కోట్లు.
- భారత రాజ్యాంగం 395 ప్రకరణలు లేదా అధికరణలు (ఆర్టికల్స్), 22 భాగాలు, 8 షెడ్యూళ్ళు (పట్టికలు)తో ఏర్పడింది.
- నేడు(2022) 470 ప్రకరణలు, 25 భాగాలు, 12 షెడ్యూళ్ళు, 5 అనుబంధాలు (అపెండిక్స్), 105 సవరణలతో, సుమారు 140 కోట్ల ప్రజలకు అనుగుణంగా రూపు దిద్దుకుంది.

**భారత రాజ్యాంగం విశిష్టతలు ........**

- భారత రాజ్యాంగం, భారతదేశ స్వరూప స్వభావాలను తెలుపుతుంది (RESUME OF THE COUNTRY).
- ప్రపంచంలోని లిఖిత రాజ్యాంగాలలో అతి పెద్దది.
- బలమైన కేంద్రంతో, సమాఖ్య లక్షణాలు కలిగి ఉన్నది.
- పార్లమెంటరీ ప్రభుత్వ విధానం కలిగియున్నది.
- అధికార విభజన కేంద్ర, రాష్ట్ర మరియు ఉమ్మడి జాబితా ప్రకారం జరుగుతుంది.
- ధృఢ అధృఢ లక్షణాల (ధృఢ లక్షణం అనగా కొన్ని అంశాలలో 2/3 వంతు మెజారిటి మరియు, సగం రాష్ట్రాల ఆమోదం. అధృఢ లక్షణం అనగా సాధరణ మెజారిటి చాలు) సమ్మేళనం కలిగియున్నది.
- ఏక పౌరసత్వం, స్వతంత్ర న్యాయవ్యవస్ద కలిగి యున్నది.
- శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్దలు అనేవి రాజ్యాంగానికి ఉన్న మూడు మూల స్దంబాలు.
- ఏక పౌరసత్వం (అమెరికా, స్విట్జర్లాండ్‌లలో ద్వంద్వ పౌరసత్వం ఉన్నది).
- 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పన

♦ భారత రాజ్యాంగంలో పీఠిక లేదా ప్రవేశిక లేదా అవతారిక లేదా ప్రియాంబుల్, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు ముఖ్యమైనవి. రాజ్యాంగపు మూల తత్వం అంతా పీఠికలోనే ఉన్నది.

**♦ <u>పీఠిక...</u>**

భారతదేశ ప్రజలమగు మేము, భారతదేశమును, సార్వభౌమ్య (సర్వసత్తాక), సామ్యవాద, లౌకిక, ప్రజాసామ్య, గణతంత్ర రాజ్యముగ ఏర్పరచుకుని, అందలి పౌరులెల్లరుకును సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమును, ఆలోచనకు, భావప్రకటనకు సంబందించిన మరియు ఏదేని విశ్వాసము, ధర్మము, ఆరాధనలకు సంబందించిన స్వేచ్ఛను, అంతస్తులోను, అవకాశములోను సమానత్వము కలిగియుండునట్లు, వారందరిలో పరస్పరం వ్యక్తి గౌరవమును, జాతి ఐక్యత మరియు అఖండతలను చేకూర్చగల సౌభ్రాతృత్వము పెంపొందించుటకు, సత్యనిష్ఠాపూర్వకముగా తీర్మానించుకుని, 1949 సంవత్సరం నవంబరు 26 తేదీన, మా రాజ్యాంగసభ యందు, ఈ రాజ్యాంగమును – ఒప్పందమును అంగీకరించి, అధిశాసనము చేసుకుని మాకు మేము ఇచ్చుకున్నాము.

**♦ <u>పీఠికలో ప్రభావంతమైన పదాలు...</u>**

**1)భారతదేశ ప్రజలమగు మేము** (WE THE PEOPLE OF INDIA), **2)సార్వభౌమ్య/సర్వసత్తాక** (SOVERIGN), **3)సామ్యవాద** (SOCIALIST), **4)లౌకిక** (SECULAR), **5)ప్రజాస్వామ్య** (DEMOCRATIC), **6) గణతంత్ర** (REPUBLIC), **7)న్యాయము** (JUSTICE), **8)స్వేచ్ఛ** (LIBERTY), **9)సమానత్వము** (EQUALITY), **10)వ్యక్తి గౌరవము** (INDIVIDUAL DIGNITY), **11)ఐక్యత** (UNITY), **12)అఖండత** (INTEGRITY), **13)సౌభ్రాతృత్వము** (FRATERNITY), **14)అధిశాసనము** (ENACT), **15)మాకు మేము ఇచ్చుకున్నాము** (GIVE OURSELVES).

**♦ <u>పీఠికలోని ముఖ్య పదాలకు వివరణ....</u>**

**♦ భారతదేశ ప్రజలమగు మేము** (WE THE PEOPLE OF INDIA) ........

ఈ పదబంధం ప్రకారం, ఈ వ్యవస్థ మొత్తంపైన కర్త, కర్మ, క్రియ ప్రజలే. దేశ ప్రాధికారకత మొత్తం, దేశ ప్రజలనుండే వచ్చింది. శాసన నిర్మాతలు, కార్యనిర్వాహక యంత్రాంగం అంతా, ప్రజలకే జవాబు దారీగా ఉండాలనేది, రాజ్యాంగం నిర్దేశిస్తుంది.

**♦ సార్వభౌమ్యం లేదా సర్వసత్తాకం** (SOVERIGN) .........

ఒక ప్రాదేశిక ఎల్లలు కలిగి, ఒక ఒప్పందానికిలోనై, జీవిస్తున్న దానినే సమాజం అంటారు. భారత సమాజం కూడా అలాంటిదే. ఏ ఇతరదేశాల ప్రభావం, ప్రమేయంతో పనిలేకుండా, స్వంత నిర్ణయాలు తీసుకోవడం, అమలు చేయడం అనే సామర్థ్యం కలిగి యున్నది. సార్వభౌములు అనగా రాజులు అని అర్థం. భారత దేశానికి సంబంధించినంత వరకూ ప్రజలే రాజులు. కామన్వెల్త్ మరియు ఐక్యరాజ్యసమితి సభ్యత్వాలవల్ల, దేశ సార్వభౌమికతకు ఎటువంటి భంగం కలుగదు.

**♦ సామ్యవాదం** (SOCIALIST) .....

సామ్యవాదమనేది ఆర్థిక అంశాలను తెలుపుతుంది. ఆర్థిక సమానత్వం కోసం వనరులను, సామాజిక ప్రయోజనాల కోసం వినియోగించడం జరుగుతుంది. సమానాభివృద్ధి, సమగ్రాభివృద్ధి అనేవి సామ్యవాద లక్షణం. సంపద, శ్రమ, ఉత్పత్తి, పంపిణీ, మిగులు అనే ఐదంశాలు, వ్యక్తిగత ఆస్తులపై పరిమితులు విధిస్తూ, సమస్త సంపదపైన అధికారం అంతా, సమిష్టిదే అని తెలుపుతుంది. వనరుల వినియోగం పూర్తిగా లేదా పాక్షికంగా, ప్రభుత్వమే నియంత్రిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేస్తుంది. ఆదేశిక సూత్రాలలో, సామ్యవాద తత్వం ఇమిడియున్నది. అయితే ప్రపంచీకరణ, సరళీకరణ, యాంత్రీకరణ, పారిశ్రామికీకరణ నేపథ్యంలో, పెట్టుబడిదారీ విధానం ముందంజ వేయడంతో, సామ్యవాదం వెనుకబడింది.

సామ్యవాదానికి వ్యతిరేకమైన, పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడులు పెరగడం, సాంకేతిక పరిజ్ఞానం ఆధిపత్యం చెలాయించడం ఉద్యోగ అవకాశాలు పెరగడం వంటి అంశాలు, కీలకం కావడంతో అభివృద్ధి చెందుతున్న దేశాలు, అభివృద్ధి చెందిన దేశాల పెట్టుబడుల కోసం, సామ్యవాద సిద్ధాంతానికి తిలోదకాలిచ్చి, పెట్టుబడిదారీ విధానం దిశగా పయనిస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానంలో ఉద్యోగకల్పన, ఆర్థిక చేయూత కలిగినా, అనేక నష్టాలున్నాయి. వ్యాపారం, లాభార్జన, ముడిసరుకుల అధిక వినియోగం ఫలితంగా, వ్యర్థాలు పెరిగి ప్రజా ఆరోగ్యం, పర్యావరణం దెబ్బతినడం జరుగుతుంది. ఇక్కడ పెట్టుబడిదారుల ప్రయోజనాలకే, ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. వాడి పారవేయడం (యూజ్ అండ్ త్రో), పాతది ఇచ్చి కొత్తది తీసుకోవడం, రకరకాల ఆఫర్లు, సెలబ్రెటీలతో ప్రచారం, నెలవారీ చెల్లింపుల సదుపాయం, సులభంగా అప్పులభించడం, కృత్రిమ అవసరాలు సృష్టించబడడం జరుగుతున్నది.

ఉత్పత్తి పెంచి దానిని ఏదోరకంగా వదిలించడం, అవసరానికి మించి కొనిపించడం జరుగుతుంది. భవిష్యత్ తరాలకు మూలవనరుల కొరత, ఆడంబరాలు, హంగులు, వెల్లువెత్తడం, ఫలితంగా అధిక సంపాదన కోసం, కొందరు మధ్యతరగతి, అల్పాదాయ వర్గాలు ప్రక్కదారులు పట్టడం లేదా, ఎక్కువ పనిచేసి, అనారోగ్యాల పాలు పడడం జరుగుతున్నది. ఉమ్మడి కుటుంబాలు తగ్గి, ఏక కుటుంబాలు విస్తరించడం, గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పెరగడం జరుగుతుంది. వ్యవసాయరంగం కుదేలు కావడం, పట్టణాలలో మురికి వాడలు విస్తరించడం, నైతిక ధర్మాలు వదలి జల్సాలకు ప్రజలు అలవాటు బడడం, నేర సంస్కృతి పెరగడం, దేశ సంస్కృతి నాశనం కావడం వంటి, అవలక్షణాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా ధనవంతుల ఇంకా ధనవంతులు కావడం, నిర్భాగ్యులు ఇంకా నిర్భాగ్యులు కావడం జరుగుతున్నది. అవసరంలేని వస్తువులను, అత్యావసరమనే భ్రమను కలిగించడం పెట్టుబడిదారీ విధానంలో జరుగుతుంది. కావున సామ్యవాద విధానంలో ఏమైనా లోపాలు ఉంటే తొలగించుకుని, సమైఖ్య భావనతో ముందుకు పోవాలి. ఉమ్మడి కుటుంబాలు సామ్యవాదానికి ప్రతీకలైతే, ఏక కుటుంబాలు పెట్టుబడిదారీ వ్యవస్తకు రూపాలనుకోవాలి.

♦ **లౌకికత్వం** (SECULAR) ...........

ప్రభుత్వం ఏమతాన్ని ప్రత్యేకంగా చూడడకుండా, అన్ని మతాలను సమానంగా చూడడం, మతాన్ని రాజ్యసంబంధమైన విషయం కాకుండా, పౌరుల వ్యక్తిగత అంశంగా చూస్తుంది. ఇహలోక విషయాలను గురించి చర్చించేదే, లౌకికి రాజ్యాంగం. అన్ని మతాలు కేవలం విశ్వాసంపై ఆధారపడి ఉంటాయి. అన్ని మతాలు మా మతమే గొప్ప అంటాయి. ఆధిపత్యంలో ఉన్న హైందవ మతాన్ని, ఇంకా అనేక భిన్న మతాలను, ఆస్తికులను నాస్తికులను, తటస్తులను ప్రభుత్వం సమానంగా చూస్తుంది. లౌకిక రాజ్యాంగం మాత్రమే ప్రజలనందరిని కలిపి ఉంచుతుంది. మత సహనం, మత సామరస్యం వలన మాత్రమే ప్రజలు ఐకమత్యంగా ఉంటారు. కావుననే విశ్వాసము, ధర్మము, ఆరాధనలకు సంబందించిన స్వేచ్ఛను, రాజ్యాంగం కలిగించింది.

♦ **ప్రజాస్వామ్యం** (DEMOCRATIC) ............

ప్రజాస్వామ్యం అంటే ప్రజలే యజమానులు. నిర్ణయం, పర్యవేక్షణ, లాభ నష్టాలు ప్రజలకే చెందుతాయి. శాసన కర్తలు, కార్యనిర్వాహక అధికారులు అందరూ, ప్రజలకు జవాబుదారులే. ప్రజాస్వామ్య ప్రభుత్వం అనేది ప్రజలచేత, ప్రజల కొరకు, ప్రజలయొక్క ప్రభుత్వం. కుల మత జాతి లింగ భాష ప్రాంత వంటి విచక్షణ లేకుండా అందరికీ 18 సంవత్సరాలకే ఓటు కల్పించడం జరిగింది. అదేవిధంగా సామాన్యులు కూడా పాలన చేయవచ్చు. ప్రజలకు ప్రాధమిక హక్కుల కల్పన జరిగింది. ప్రజాస్వామ్యం అమలు కాక పోవడానికి కారణాలు చూడండి.

రాజ్యాంగం పట్ల ప్రజలకు, అధికారులకు, శాసన కర్తలకు సరైన అవగాహన లేకపోవడం. ఎన్నికలు వ్యాపారధోరణిలో సాగడం, కులం, మత, డబ్బు, మద్యం ప్రభావంతో, ఎన్నికలు సక్రమంగా జరగకపోవడం జరుగుతున్నది. ఎన్నికలలో పోటీ చేసేవారికి చదువు, వయస్సు వంటి అర్హతలు లేకపోవడం, ఎన్నికలలో కంట్రాక్టర్లు, వ్యాపారులు, రౌడీల ప్రమేయం పెరగడం, ఓటు హక్కు అందరూ వినియోగించుకోక పోవడం, గెలవడం కోసం ఆకర్షక పధకాలతో ఏరవేయడం, పార్టీల మానిఫెష్టోలు చట్టబద్ధం కాకపోవడం, విపరీతమైన సంక్షేమ పధకాలతో ప్రజలను, సోమరులుగా చేయడం, మేధావులు మౌనంగా ఉండడం, పెత్తందారీ, జమిందారీ, భూస్వామ్య, వలస లక్షణాల ధోరణిలను వదలక పోవడం, రాజకీయాలలో భక్తి, వీరపూజ, వంశపారంపర్యం, దివాళాకోరుతనం చోటు చేసుకోవడం, అవినీతి, అత్యాచారాలు, నేరాలు చేసిన వారు గెలవడం, ప్రభుత్వాలు ఉత్పాదక రంగాలలో కాకుండా అనుత్పాదక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, అనర్హులు అర్హుల అవకాశాలను కాజేయడం, కొందరు శాసన కర్తలు, అధికారులు అవినీతికి పాలుపడడం, రాజ్యాంగ నిర్దేశితమైన చట్టాలను పట్టించుకోక పోవడం, అధికార వికేంద్రీకరణ సరిగ్గా జరగకపోవడం వంటివి కారణాలు.

♦ **గణతంత్రం** (REPUBLIC) ..........

గణము అంటే సమూహము. తంత్రము అంటే వశములో ఉండడం. ఒక బృందముచే పాలన జరుగుతుంది. మన దేశంలో శాసన, కార్యవర్గ, న్యాయ వ్యవస్థల బృందం, పాలన సజావుగా సాగడానికి దోహదపడతుంది. కుల మత లింగ భాష ప్రాంత విచక్షణ లేకుండా, ఎవరైనా ప్రజల ఓటుతో, ఎన్నిక ద్వారా గెలిచిన ప్రజా ప్రతినిధులు కలసి, మంత్రి వర్గము ఏర్పాటు చేసి, కార్యనిర్వాహక, న్యాయశాఖలతో కలసి, ఉమ్మడి నిర్ణయాలు తీసుకుంటారు. పార్లమెంటు, శాసనసభ, పంచాయితీ వంటి వ్యవస్థలు అన్నీ బృంద రూపేణా పనిచేస్తాయి. దీనినే పార్లమెంటరీ లేక ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అంటారు. గణతంత్రమనే

పదము రాచరికానికి వ్యతిరేకమైనది. రాచరికంలో రాజు మాత్రమే పాలకుడు. అతనిమాటే కట్టుబాటు. వారసత్వమే రాజుకు అర్హత. కాని గణతంత్ర వ్యవస్థ ఉమ్మడి తనాన్ని, కలసి నిర్ణయాలు తీసుకోవడం అనే లక్షణాలు కలిగి ఉంటుంది.

♦ **న్యాయము** (JUSTICE) .....

న్యాయము అనేది సామాజిక, ఆర్థిక, రాజకీయ అనే మూడు రంగాలలో, అందరికీ పూర్తి సమానమైన న్యాయము లభించడం. సామాజిక న్యాయమును ప్రాథమిక హక్కులలో, ఆర్థిక న్యాయమును ఆదేశిక సూత్రాలలో, రాజకీయ న్యాయమును అందరికీ ఓటు హక్కు కలిగించడం, రిజర్వేషన్ ద్వారా ఎన్నికలలో కొన్ని స్థానాలు కేటాయించడం ద్వారా జరిగింది.

♦ **స్వేచ్ఛ** (LIBERTY) ......

ప్రజాస్వామ్య మూల స్తంబాలలో, స్వేచ్ఛ ముఖ్యమైనది. ఆర్టికల్19 లో వాక్ స్వాతంత్రము, భావ ప్రకటన, స్వేచ్ఛగా దేశంలో ఎక్కడైనా నివాసము, వ్యాపారము, ఉద్యోగం చేసుకోవచ్చు వంటివి, ఆర్టికల్ 25 నుండి 28వరకు మత స్వేచ్ఛను పొందు పరచారు.

♦ **సమానత్వం** (EQUALITY) ...

ఆర్టికల్ 14 నుండి 18 వరకూ ఉన్న ప్రాథమిక హక్కులలో, సమానత్వపు హక్కు, రిజర్వేషన్లు కల్పించారు.

**ఐక్యత** (UNITY) ....

దేశం విచ్ఛిన్నం కాకుండా అన్యోన్యంగా కలసి ఉండి, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం కోసం, జాతి ఐక్యత అవసరం.

♦ **అఖండత** (INTEGRITY) ...

జాతి అఖండతలను కాపాడాలనే అంశాన్ని, ప్రాథమిక విధులలో, పొందు పరచారు. అఖండత అనేది ప్రజల మధ్య జాతీయ భావాన్ని పెంచుతుంది.

♦ **సౌభ్రాతృత్వము** (FRATERNITY) .......

సౌభ్రాతృత్వము అనగా సోదరభావం, సమానహోదా కలిగి ఉండడం. దీనిని ప్రాథమిక విధులలో పొందు పరచారు. దేశ ప్రజల మధ్యే కాకుండా ఇతర దేశాలతో కూడా, సోదరభావం కలిగి ఉండడం జరుగుతుంది.

**<u>రాజ్యాంగ ప్రస్తావన సారం</u>** ....

భారతదేశం ఏక ఖండం. పౌరులందరూ ఏకజాతీయులు. జాతి ఐక్యత, అఖండతలను కాపాడుకోవడం ప్రజల విధి. పెద్ద కుటుంబమనే భారత సమాజంలో సాంఘికంగా, సంపదలో, అధికారంలో అంతా సమానులే. ప్రజల మధ్య ఉన్న సంబంధాలన్నీ ఈలోకానికి సంబందించినవే. దేశం సర్వసత్తాకమైనది మరియు, బహిర్గత శక్తుల ప్రభావానికి లోబడదు. హక్కులు-విధుల భాగమే రాజ్యాంగం ప్రధాన క్షేత్రం. రాజ్యాంగ సూత్రీకరణలో విధులు-నిషేదాలు అన్న స్వభావం అంతర్లీనంగా ఉన్నది. ప్రజలందరి ప్రయోజనాల కోసమే హక్కులు, విధులు ఏర్పాటు చేయబడ్డాయి. హక్కు అంటే రావలసినది రాబట్టుకోవడం, విధి అంటే తన కర్తవ్యాన్ని తప్పక పాటించడం. ఈ రెండూ ఇచ్చి పుచ్చుకునే సంబంధాలే. ఇవ్వడం, పుచ్చుకోవడం అనేది సక్రమంగా జరిగితే సమస్యలు రావు. రాజ్యాంగానికి అనుగుణంగా చట్టాలు, చట్టాలకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేయబడతాయి. దేశభక్తి అంటే రాజ్యాంగం మరియు రాజ్యాంగం ద్వారా రూపొందించిన చట్టాలను గౌరవించడమే. అందరూ చట్టప్రకారం నడుస్తే సమస్యలే రావు. రాజ్యాంగం కంటే రాజ్యాంగ విధేయతే గొప్పది.

రాజ్యాంగంలోని 3వ అధ్యాయంలోని, 13వ ఆర్టికల్ నుండి 35 వ ఆర్టికల్ వరకూ ప్రాథమిక హక్కులు, నాల్గవ అధ్యాయంలోని 36వ ఆర్టికల్ నుండి 51వ ఆర్టికల్ వరకూ ఆదేశిక సూత్రాలు, 4.ఎ ఆధ్యాయంలోని 51ఎ ఆర్టికల్ ప్రాథమిక విధులను గురించి తెలియచేస్తుంది. ప్రాథమిక హక్కులు ప్రజలకు రాజ్యాంగ ప్రసాదిత హక్కులు. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలు చేయవలసి పనులు. ప్రాథమిక విధులు ప్రజలు తమ పొరుగు వారి పట్ల, దేశం పట్ల పాటించవలసిన కర్తవ్యాలుగా భావించాలి.

భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలు 1) ప్రాథమిక హక్కులు (FUNDAMENTAL RIGHTS), 2) ఆదేశిక సూత్రాలు (DIRECTIVE PRINCIPLES), 3) ప్రాథమిక విధులు (FUNDAMENTAL DUTIES)

**<u>1వ భాగం</u>** ........ ఆర్టికల్ 1 నుండి 4 వరకు – **భారతదేశ భూభాగం గురించి** (పేరు, భూభాగం, రాష్ట్రాల ఏర్పాటు)

**<u>2వ భాగం</u>** .......ఆర్టికల్ 5 నుండి 11 వరకు – **పౌరసత్వం గురించి**

♦ **<u>3వ భాగం.... రాజ్యమునకు నిర్వచనము మరియు ప్రాధమిక హక్కులు.</u>**

♦ ఆర్టికల్ 12 –**రాజ్యము అనే పదం క్రింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక మరియు ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు వస్తాయి.**

♦ ఆర్టికల్ 13 నుండి 35 వరకు - **ప్రాధమిక హక్కులు.**

♦ **<u>ప్రాధమిక హక్కులు</u> ....** (FUNDAMENTAL RIGHTS)

1) సమానత్వపు హక్కు (RIGHT TO EQALITY), 2) స్వేచ్ఛ, స్వాతంత్రపు హక్కు (RIGHT TO LIBERTY AND FREEDOM), 3) దోపిడీ నిరోధక హక్కు (RIGHT AGAINST EXPLOITATION), 4) మత స్వేచ్ఛ స్వాతంత్ర్యపు హక్కు (RIGHT TO FREEDOM OF RELIGION), 5) సాంస్కృతిక, విద్యా పరమైన హక్కు (CULTURAL AND EDUCATIONAL RIGHTS), 6) రాజ్యాంగ పరిహారపు హక్కు (RIGHT TO CONSTITUTIONAL REMEDIES).

♦ ఆర్టికల్ 13 – **ప్రాధమిక హక్కులను హరింప చేయు శాసనములు చెల్లవు.**
అనగా దీని ప్రకారం ప్రాధమిక హక్కులకు విరుద్ధంగా రాజ్యాంగ సవరణలు, శాసనాలు చేయరాదు. శాసన వ్యవస్థకు పరిమితులు విధిస్తుంది.

**<u>1) సమానత్వపు హక్కు</u>** (RIGHT TO EQALITY) **(ఆర్టికల్ 14 నుండి 18 వరకు 5 ఆర్టికల్స్)**

♦ఆర్టికల్ 14 – **చట్టం ముందు అంతా సమానులే.** (EQUALITY BEFORE LAW) జాతి, మత, లింగ, వర్ణ, జాతీయత, కులం ప్రకారం వివక్షత చూపరాదు. అయితే వెనుక బడ్డ కులాలు మరియు వెనుకబడ్డ తరగతులకు విద్యా సంస్థలు, ఉద్యోగాలలో మినహాయింపులు ఇచ్చి, ప్రత్యేక అవకాశాలు కల్పించవచ్చు. చట్టం ప్రకారం అందరికీ సమాన రక్షణ కలుగుతుంది.

♦ఆర్టికల్ 15 – **వివక్షత చూపరాదు.** జాతి, మత, కుల, లింగ, జన్మస్థలం అనే 5 అంశాలు ఆధారంగా, ప్రభుత్వం ఎవరిపట్లా వివక్షత చూపరాదు.

♦ ఆర్టికల్ 16 – **ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికీ సమాన అవకాశాలు.** ప్రభుత్వ ఉద్యోగాలలో మతం, వర్ణం, కులం, లింగం, వంశపారంపర్యం, జన్మ, నివాస స్థళం అనే 7 అంశాల ఆధారంగా, వివక్షత చూపరాదు.

♦ ఆర్టికల్ 17 – **అస్పృశ్యత శిక్షార్హం.** అంటరానితనం, పవిత్రుడు, అపవిత్రుడు, పంచముడు అనే పేర్లతో ఎవరినైనా, తక్కువగా చూడడం శిక్షార్హమైన నేరంగా, పరిగణించ బడుతుంది.

♦ ఆర్టికల్ 18 – **బిరుదులు రద్దు.** సైనిక( పరమవీరచక్ర, మహావీరచక్ర, అశోకచక్ర) మరియు విద్యాసంబందమైన బిరుదులు (పిహెచ్‌డి, డాక్టర్, ప్రొఫెసర్) తప్ప, ఇతరత్రా బిరుదులు లేవు. అయితే సమాజానికి వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ వంటి పురస్కారాలతో సత్కరిస్తారు. పూర్వం బ్రిటీష్ కాలంలో సర్, రావుబహద్దూర్, రావుసాహెబ్, జమిందార్, జాగీర్దార్ వంటి బిరుదులు నేడు చలామణి కావు.

**<u>2) స్వేచ్ఛ స్వాతంత్ర్యపు హక్కు</u>** (RIGHT TO LIBERTY AND FREEDOM) (ఇవి ఆర్టికల్ 19నుండి 22 వరకు 4 ఆర్టికల్స్)
వీటిని వ్యక్తిగత స్వేచ్ఛా హక్కులు అంటారు.

♦ ఆర్టికల్ 19 – **వివిధ స్వేచ్ఛలు, వాటిపై పరిమితులు.** వాక్‌స్వాతంత్ర్యము, భావప్రకటనా స్వేచ్ఛ. ఆయుధాలు లేకుండా సమావేశాలు జరుపుకోవచ్చు. సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చు. దేశంలో ఎక్కడికైనా పర్యటించవచ్చు. దేశంలో ఎక్కడైనా నివసించవచ్చు. దేశంలో ఎక్కడైనా వ్యాపారం, ఉద్యోగం చేసుకోవచ్చు.

♦ఆర్టికల్ 20 – **నేరస్తులకు వెసులుబాటు.** చట్టాన్ని అతిక్రమించందే ఏవ్యక్తి శిక్షార్హుడు కాదు. శాసనం అమలు ఉన్నప్పుడే శిక్ష. ఒకే నేరానికి ఒకే శిక్ష. నేరాంగీకారం కోసం బలవంతం చేయరాదు. నేరస్తుడిని సంస్కరించాలనేది ఆర్టికల్ ముఖ్యలక్షణం.

♦ ఆర్టికల్ 21 – **వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు.** వ్యక్తి ప్రాణానికి, స్వాతంత్ర్యానికి ఆటంకం కలిగించరాదు. సరైన ఉత్తర్వులు లేకుండా పోలీసులు ఇంట్లోకి ప్రవేశింపరాదు. నిర్భందించరాదు. థర్డ్ డిగ్రీ పద్దతులు అమలు చేయరాదు. ఆత్మహత్య శిక్షార్హం. జీవించడానికి అవసరమైన జీవనోపాధి, విదేశాలకు వెళ్ళడం, వ్యక్తిగత రహస్యాలు కాపాడుకోవడం, ఆశ్రయం పొందడం, ఏకాంత జీవితం, ప్రమాదాలలో ప్రభుత్వ మరియు ప్రైవేటు వైద్యశాలలో తక్షణ చికిత్స పొందడం, ఆరోగ్యం, త్రాగునీరు, విద్యార్జన, ఉచిత న్యాయం, ఖైదీలకు రక్షణ, పరిహారం పొందడం, ఆహారం పొందడం, సమాచారం పొందడం వంటి 26 హక్కులు కలవు.

♦ ఆర్టికల్ 21ఎ – **విద్యాహక్కు.** దీని ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల బాల బాలికలకు నిర్బంధ, ఉచిత విద్య అందచేయాలి. దీనినిబట్టే విద్యాహక్కు చట్టానికి అనుగుణంగా 14 అంశాలను, పొందుపరచారు.

♦ ఆర్టికల్ 22 – **ఉత్తర్వులు లేకుండా అక్రమంగా నిర్బంధించరాదు.** అరెస్ట్‌కు సంబందించిన కారణాలు తెలుసుకోవచ్చు. న్యాయవాది సలహా పొందవచ్చు. అరెస్ట్ చేసిన వ్యక్తిని 24 గంటలలోపు న్యాయమూర్తి ముందు ఉంచాలి.

**<u>3) దోపిడీ నిరోధక హక్కు</u>** (RIGHT AGAINST EXPLOITATION). (ఆర్టికల్స్ 23, 24 రెండు ఆర్టికల్స్)

♦ ఆర్టికల్ 23 – **మనుషులను అమ్మడం కొనడం, బలవంతపు చాకిరీ నిషేదం.** స్త్రీల, శిశువుల, బాలికల అమ్మకం నిషిద్ధం. వెట్టిచాకిరీ, వ్యభిచారం, దేవదాసి/జోగిని వంటి అమానవీయ పనులు శిక్షార్హం. అయితే ప్రభుత్వం శ్రమదానం, జన్మభూమి, స్వచ్ఛభారత్ వంటి సార్వజనీన ప్రయోజనాల కోసం, ఉన్నత చదువులలో ఉన్న విద్యార్థినీ విద్యార్థులను, పౌరులను, ప్రభుత్వ ఉద్యోగులను నిర్బంధసేవకు ఉపయోగించుకోవచ్చు. దానిని శ్రమదోపిడీగా పరిగణించరు.

♦ ఆర్టికల్ 24 – **బాలకార్మిక వ్యవస్థ నిషేదం.** 14 సంవత్సరములలోపు బాల బాలికలచే శారీరక శ్రమతో కూడిన పనులు నిషిద్ధం. బాలల పరిరక్షణ కోసం, బాలల ఉపాధి చట్టం, ఫాక్టరీల చట్టం, బాల కార్మిక నిషేద చట్టం వంటి 12 చట్టాలు చేశారు.

**<u>4) మత స్వాతంత్ర్యపు హక్కు</u>** (RIGHT TO FREEDOM OF RELIGION). (ఆర్టికల్ 25 నుండి 28 వరకు 4 ఆర్టికల్స్)

♦ ఆర్టికల్ 25 – **మత విశ్వాసాలను కలిగి ఉండడం, మత ప్రచారం చేసుకోవచ్చు.** ఏ మతంలోనైనా చేరవచ్చు, విడువవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు. బలవంతపు మత మార్పిడులు నిషిద్ధం. మందిర ప్రవేశాలకు అనుమతి, దేవాదాయ శాఖ ఏర్పాటు చేశారు.

♦ ఆర్టికల్ 26 – **మత వ్యవహారాల నిర్వహణా స్వేచ్చ.** దీని ప్రకారం మత ధార్మిక సంస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు. మత కార్యక్రమాలు, స్థిర చరాస్తుల సమకూర్చుకొని నిర్వహించుకోవడం, చేసుకోవచ్చు.

♦ ఆర్టికల్ 27 – **మత వ్యాప్తికి, మత పోషణకు పన్నులు వేయరాదు.** నిర్బంధ వసూళ్ళు చేయరాదు. అయితే ప్రభుత్వం ప్రత్యేక దర్శనం వంటి సేవలకోసం, రుసుములు విధించవచ్చు.

♦ ఆర్టికల్ 28 – **ప్రభుత్వ విద్యాలయాలలో మతబోధనలు నిషిద్ధం.** అయితే మత సంస్థలు ప్రత్యేకంగా నడుపుకునే విద్యాలయాలలో మతబోధన చేసుకోవచ్చు. ప్రభుత్వ సహాయం పొందే కొన్ని మత విద్యాలయాలలో జరిగే మతబోధనలలో, ఇష్టప్రకారం పాల్గొనవచ్చు.

**<u>5) సాంస్కృతిక, విద్యా పరమైన హక్కు</u>** (CULTURAL AND EDUCATIONAL RIGHTS) (ఆర్టికల్ 29, 30 రెండు ఆర్టికల్స్)

♦ ఆర్టికల్ 29 – **అల్ప సంఖ్యాక వర్గాల ప్రయోజన పరిరక్షణ.** అల్ప వర్గాలు తమ భాష, లిపి, సంస్కృతులను కాపాడుకోవచ్చు. ప్రభుత్వ మరియు అనుబంధ విద్యాసంస్థలలో మతం, జాతి, కులం, భాష అనే కారణాలతో ప్రవేశాలు నిరాకరించరాదు.

♦ ఆర్టికల్ 30 – **అల్ప సంఖ్యాక వర్గాలు స్వంత విద్యా సంస్థలు స్థాపించి, నిర్వహించుకోవచ్చు.** మత, భాష ప్రాతిపదికగల అల్ప వర్గాలు ఏర్పాటు చేసుకునే విద్యాసంస్థలకు, ప్రభుత్వం చేయూత ఇవ్వాలి.

**<u>ఆర్టికల్ 31 ఆస్థిహక్కు, దీనిని 44 వ రాజ్యాంగ సవరణ ద్వారా రద్దు చేసి, చట్టబద్ధమైన హక్కుగా మార్చారు.</u>**

**6) రాజ్యాంగ పరిహారపు హక్కు** (RIGHT TO CONSTITUTIONAL REMEDIES) (ఆర్టికల్ 32 నుండి 35 వరకు 4 ఆర్టికల్స్)

♦ ఆర్టికల్ 32 – **ప్రాధమిక హక్కుల పరిరక్షణకు 5 రిట్లు జారీ.** ప్రాధమిక హక్కులకు భంగం కలిగినప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చును. సుప్రీంకోర్టు తప్పని సరిగా పాటించవలసిన 5 రకాల రిట్లు జారీ చేస్తుంది. అవి **హెబియస్ కార్పస్** (అక్రమ నిర్బంధంలోని వ్యక్తిని 24 గంటలలోపు న్యాయస్థానం ముందు హాజరుపరచాలి అని ఆదేశిస్తారు). **మాండమస్** (తమ అధికార పరిధిలో ఉన్న విధులను చేయడానికి నిరాకరించిన అధికారులకు, ప్రభుత్వానికి, దిగువ కోర్టులకు, న్యాయ ట్రిబ్యునళ్ళకు ఈ రిట్ జారీ చేస్తారు). **ప్రొహిబిషన్** (దిగువ స్థాయి కోర్టులు తమకు అధికారంలేని కేసులు విచారిస్తుంటే, దానిని ఆపుచేయడానికి ఇది జారీ చేస్తారు). **సెర్షియోరరి** (దీనిని ప్రొహిబిషన్‌తో కలిసి జారీ చేస్తారు. క్రింది స్థాయి కోర్టులు తమ అధికార పరిధిని అతిక్రమించి ఇచ్చిన, తీర్పులను రద్దుచేసి పైస్థాయి కోర్టుకు బదిలీ చేయమని, ఈరిట్ జారీ చేస్తారు). **కొవారెంటో** (ప్రభుత్వ సంస్థలలోని వ్యక్తి ఆ పదవి పొందుటకు హక్కు లేదని భావించినప్పుడు, అతనిని ఆపదవినుండి తొలగించడానికి దీనిని జారీ చేస్తారు).

♦ ఆర్టికల్ 33 – **ప్రాధమిక హక్కులను రక్షణ దళాలకు అన్వయించినపుడు, వాటికి పార్లమెంటు మార్పులు చేయవచ్చు.**

♦ ఆర్టికల్ 34 – **సైనిక శాసనం అమలులో ఉన్నప్పుడు ప్రాధమిక హక్కులకు పరిమితులు ఉంటాయి.**

♦ ఆర్టికల్ 35 – **ప్రాధమిక హక్కులు అమలుకు దోహదపడే మరో శాసనాన్ని, పార్లమెంటు మాత్రమే చేయాలి.**

**డా. అంబేద్కర్, ప్రాధమిక హక్కులకు రక్షణ కలిగించే ఈ ఆర్టికల్ 32ను, భారత రాజ్యాంగానికి ప్రాణం, గుండె, ఆత్మ, హృదయం అని పేర్కొన్నాడు.**

**రాజ్యాంగపు పరిహారపు హక్కును, హక్కుల అమలుకు హక్కు/హక్కులకే హక్కు అని పేర్కొంటారు.**

**<u>4వ భాగం</u> .... <u>ఆదేశిక సూత్రాలు</u>** (DIRECTIVE PRINCIPLES). (ఆర్టికల్ 36 నుండి 51 వరకు 22 ఆర్టికల్స్)

♦ ఆర్టికల్ 36 – **రాజ్యమనే మాటకు నిర్వచనం ఆర్టికల్ 12 ప్రకారమే** ( కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు) చెప్పాలి.

♦ ఆర్టికల్ 37 – **ప్రభుత్వాన్ని ఆదేశిక సూత్రాలు అమలు చేయవలసినదిగా, న్యాయస్థానాలు ఆదేశించరాదు.** అయితే ప్రభుత్వం శాసనాలు చేసేటప్పుడు ఆదేశిక సూత్రాలను పరిగణనలోకి తీసుకోవాలి.

♦ ఆర్టికల్ 38 – **ప్రజా సంక్షేమం కోసం అవసరమైన సామాజిక వ్యవస్థను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి.** ప్రజల ఆదాయాలలో అసమానతలు లేకుండా ప్రభుత్వం చూడాలి.

♦ ఆర్టికల్ 39 – **ప్రభుత్వం పౌరులపట్ల అనుసరించవలసిన విధి విధానాలు.** స్త్రీ పురుషులందరికీ సమానంగా జీవనోపాధి కల్పన. భౌతిక వనరుల సక్రమ పంపిణీ. దేశ సంపద, ఆర్థిక వ్యవస్థ, ఉత్పత్తి కేంద్రీకృతం కాకుండా చూడడం. సమానపనికి సమాన వేతనం. బాలబాలికల ఆరోగ్యం, శక్తి పరిరక్షణ, వారిని పనులకు వెళ్ళనీయకుండా చూడడం. వారికి తగిన అవకాశాలను, సౌకర్యాలను కల్పించడం. ఉచిత న్యాయ సహాయం.

♦ ఆర్టికల్ 40 – **గ్రామ స్వపరిపాలనకు పంచాయితీల ఏర్పాటు**, వాటి పరిపుష్టికి చేయూత.

♦ ఆర్టికల్ 41– **నిర్భాగ్యులకు ఆసరా.** నిరుద్యోగులకు ఉపాధి, వృద్ధులకు, వికలాంగులకు, అనారోగ్యులకు,పేదవారికి జీవనభృతి కల్పన. పనిహక్కు, విద్యాహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి.

♦ ఆర్టికల్ 42 – **కార్మికులు పనిచేయడానికి అవసరమైన పరిస్థితుల కల్పన.** గర్భిణీ స్త్రీలకు ప్రసూతి సదుపాయాలు కల్పించాలి.

♦ ఆర్టికల్ 43 – **కార్మికులకు జీవన వేతనాలు, భృతి.** వ్యవసాయ, పారిశ్రామిక కార్మికులకు జీవన ప్రమాణాల పెంపు. కుటీర పరిశ్రమలకు తోడ్పాటు. పరిశ్రమల నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలి.

♦ ఆర్టికల్ 44 – **పౌరులందరికీ ఉమ్మడి పౌరస్మృతి.**

♦ ఆర్టికల్ 45 – **6 సంవత్సరాలలోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య. 14 సంవత్సరాలలోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్యా కల్పన.**

♦ ఆర్టికల్ 46 – **షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుక బడిన జాతులు, బలహీన వర్గాలకు విద్య, ఆర్థిక ప్రయోజనాలకు చేయూత.** సాంఘీక అన్యాయాలనుండి, దోపిడీలనుండి వారిని సంరక్షించాలి.

♦ ఆర్టికల్ 47 – **ప్రజల జీవన స్థాయిని పెంచే చర్యలు.** మధ్యపానం, మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే చర్యలను ప్రభుత్వం తీసుకుని, వారికి పౌష్టిక ఆహారాన్ని అందించడం, ప్రజల ఆరోగ్యం పెంచే చర్యలు తీసుకోవడం.

♦ ఆర్టికల్ 48 – **వ్యవసాయ, పశుగణాభి వృద్ధికి చేయూత.** వ్యవసాయం, పాడి పరిశ్రమల పెంపుదలకు చర్యలు తీసుకోవడం. పశువుల పెంపుడు జంతువుల వధను ప్రభుత్వం నిషేదించాలి. అడవులను, వన్యప్రాణులను కాపాడడం, పర్యావరణాన్ని రక్షించడం చేయాలి.

♦ ఆర్టికల్ 49 – **జాతీయ ప్రాముఖ్యత కలిగిన పురాతన కట్టడాలను, చారిత్రక ప్రదేశాలను, స్మారక చిహ్నలను ప్రభుత్వం పరిరక్షించాలి.**

♦ ఆర్టికల్ 50 – **కార్యనిర్వాహక శాఖ నుండి, న్యాయ శాఖను వేరుచేయడం.**

♦ ఆర్టికల్ 51 – **అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణ, గౌరవప్రదమైన సత్సంబంధాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలి.** అంతర్జాతీయ న్యాయసూత్రాలను, ఒప్పందాలను గౌరవించడం, అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి అవసరమైతే మధ్యవర్తిత్వం ద్వారా ప్రభుత్వం కృషి చేయాలి.

**ఆదేశిక సూత్రాలు ప్రభుత్వం చేయవలసిన కర్తవ్యాలు. వీటి ప్రభావంతోనే బాంకుల జాతీయాకరణ, రాజ భరణాల రద్దు. భూసంస్కరణలు, రిజర్వేషన్లు, 20 సూత్రాల ఇందిరా గాంధీ పథకం, వివిద సంక్షేమ కార్యక్రమాలు, వివిధ జనాకర్షణ పథకాలు పెట్టడం జరిగింది. ఆదేశిక సూత్రాలకు న్యాయ సంరక్షణలేదు. పోలీసు రాజ్యానికి వ్యతిరేకమైన సంక్షేమరాజ్య, శ్రేయోరాజ్య లక్షణాలు కలిగియున్నది. సామాజిక, ఆర్థిక,**

రాజకీయ సమానత్వం దిశగా ప్రభుత్వం ఆదేశిక సూత్రాలను అమలు చేయాలి. ఇవి ఆర్థిక వనరుల లభ్యతకు లోబడి అమలు చేయబడతాయి. ప్రభుత్వ విధులను, బాధ్యతలను తెలుపుతాయి కనుక సకారాత్మకమైనవి. శాసనాల రూపకల్పన వాటిని అమలు చేయడానికి ఇవి మార్గదర్శకాలుగా పనిచేస్తాయి. ఆదేశిక సూత్రాలు సామ్యవాద, గాంధేయవాద, ఉదారవాద నియమాలుగా వర్గీకరించారు. ఆదేశక సూత్రాలు ప్రభుత్వ పనితీరుకు అద్దం పడతాయి. ఇవి ప్రాథమిక హక్కులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తాయి. ఇవి న్యాయవ్యవస్థకు మార్గదర్శకాలుగా ఉంటాయి.

<u>**భాగము 4 ఎ. ప్రాథమిక విధులు**</u> (FUNDAMENTAL DUTIES) (ఆర్టికల్ 51 ఎ) ఇవి 11

- ఎ. రాజ్యాంగాన్ని, దాని లక్ష్యాలను, వ్యవస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి.
- బి. స్వాతంత్ర్య సాధనకు స్ఫూర్తి ఇచ్చిన ఆదర్శాలను, ఉన్నత భావాలను గౌరవించాలి.
- సి. దేశ సార్వభౌమత్వాన్ని, సమైక్యతను, అఖండతలను పరిరక్షించాలి.
- డి. దేశ రక్షణ కోసం, దేశ సేవకోసం సంసిద్ధులై ఉండాలి.
- ఇ. మత, భాష, ప్రాంత, వర్గ విబేధాలకు అతీతంగా దేశ ప్రజలలో సోదరభావం, సామరస్యము పెంచాలి. మహిళలను గౌరవించాలి.
- యఫ్. దేశంలోని ఉమ్మడి సంస్కృతిని, వారసత్వాన్ని, గౌరవించడం, రక్షించడం చేయాలి.
- జి. అడవులు, నదులు, సరస్సులు, వన్యజీవులతో సహా సహజ ప్రకృతిని, పరిసరాలను కాపాడడం, అభివృద్ధి పరచడం చేయాలి. అన్ని జీవుల యెడల కరుణ కలిగి ఉండాలి.
- హెచ్. శాస్త్రీయ దృక్పథం, హేతు దృష్టి, మానవతా దృష్టి, పరిశోధనా తత్వం అలవరచుకోవడం, జిజ్ఞాస, సంస్కరణ ప్రవృత్తులను పెంపొందించడం.
- ఐ. ప్రభుత్వ ఆస్తులను, దేశ సంపదను రక్షించడం. హింసాయుత చర్యలను విడనాడాలి.
- జె. వ్యక్తిత్వం, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడం, సమిష్టి కృషి, సేవాకార్యక్రమాల ద్వారా అన్ని రంగాలలో అభివృద్ధి.
- కె. ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాలలోపు గల బాలబాలికలకు, విద్యావకాశాలను కలిగించే బాధ్యత, వారి తల్లితండ్రులకు, సంరక్షకులకు కలిగియున్నది.

ప్రాథమిక విధులు, ప్రజలు ప్రభుత్వం పట్ల, సమాజం పట్ల చేయవలసినవి. వీటికి న్యాయ సంరక్షణ లేదు. వీటి అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాలు చేయాలి. ఇవి పౌరులకు మాత్రమే వర్తిస్తాయి. కొన్ని ప్రాథమిక విధులు నైతికపరమైన బాధ్యతలు, మరికొన్ని పౌర బాధ్యతలుగా ఉన్నాయి. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు ఒకదానితో ఒకటి, పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. హక్కులు లేని విధులు బానిసత్వానికి దారి తీస్తాయి. అదేవిధంగా విధులు లేని హక్కులు అరాచకత్వానికి దారితీస్తాయి. ప్రాథమిక విధులు ప్రజలను నిత్యం, వారి వారి బాధ్యతలను గుర్తుచేస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు సహాయపడతాయి. వ్యక్తుల మధ్య ఉద్రిక్తతలను తొలగించి, శాంతి స్థిరత్వాలను చేకూరుస్తాయి. భారతదేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమైఖ్యత, సమగ్రత, పర్యావరణ వంటి సమస్యలను పరిష్కరింప చేయవచ్చు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసంచేయడం వంటి అసాంఘీక శక్తులకు ఇవి, హెచ్చరికగా పనిచేస్తాయి. మూఢ విశ్వాసాలతో కునారిల్లుతున్న భారతీయ సమాజాన్ని, శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా తత్వం అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తాయి.

■ ఇప్పటి వరకూ పాలకులుగా ఉన్నవారు, సేవకులుగా మారబోతున్నారు. ( మొదటి రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా డా.రాజేంద్రప్రసాద్)

■ రాజ్యాంగం ఎంత గొప్పదైనా అమలు చేసేవారు మంచివారైతేనే, ప్రజలకు మేలు జరుగుతుంది. (డా. అంబేద్కర్)

పారేపల్లి సత్యనారాయణ (ప్రజాసామ్య పరిరక్షణ ఐక్య వేదిక, ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర కోశాధికారి) 9959190408
parepalli.satyanarayana@gmail.com